స్థలం - ముందుగా రాసినట్టుగానే మీ యిద్దరికీ చెందుతుంది. చట్టప్రకారం నా భార్య అనసూయకు నా పెన్షన్‌లో సగభాగం ఆమెకు తన జీవితకాలం లభిస్తుంది. అందుకే నేనామెను పెళ్లిచేసుకున్నాను. నేనామెను పెళ్లిచేసుకోకపోతే నా పెన్షన్ నాతోనే ఆగిపోయేది. పిల్లలకెలాగూ పెన్షన్ రాదు. మీకూ తెలుసుగదా! మీ అమ్మకూ, నాకూ అనసూయ చేసిన సేవలకు ప్రతిఫలంగా కృతజ్ఞతాభావంతో ఇది నేనామెకు చూపిన ఉపాధి!"

-కొట్టి రామారావు (మచిలీపట్నం)

☆ ☆ ☆

# డామిట్... కథ అడ్డం తిరిగింది!

ఈ ఉద్యోగమేదో పదిరోజుల క్రితం వచ్చుంటే ఎంతో ఆనందపడేవాడు ఓబులేసు. పైపెచ్చు వెంకట్రావుగారి అమ్మాయితో నిశ్చితార్థం కాన్సిల్ చేసుకునేవాడు. పెళ్లి కూడా పదిహేను రోజుల్లో వుంది. ఇప్పుడు ఓబులేసు బాధల్లా ఈ సంబంధాన్ని ఎలా వదిలించుకోవాలనే.

తనకు ఉద్యోగం లేదని తక్కువ కట్నం తీసుకుంటూ పెద్ద అందంగా లేని వెంకట్రావుగారి అమ్మాయి సుజాతను పెళ్లి చేస్కోవాలనుకున్నాడు ఓబులేసు.

తన అదృష్టమో దురదృష్టమో సుజాతతో నిశ్చితార్థం అయిన మరునటి రోజే తనకు ఉద్యోగంలో జాయిన్ అవమని అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది.

తను అందగాడు (అని ఓబులేసు ఫీలింగు) దానికి తోడు ఇప్పుడు సలక్షణమైన ఉద్యోగం వుంది. అలాంటప్పుడు తను బాగా కట్నం ఇచ్చే వాళ్ల సంబంధమో లేదా సినిమా హీరోయిన్ కరీనా కపూర్‌లాంటి అమ్మాయినో చేస్కోవాలిగానీ, ఓ మోస్తరు అందంగా వున్న సుజాతను పెళ్లిచేస్కోవాల్సిన దుస్థితి తనకేంటని మనస్తాపం చెందుతున్నాడు ఓబులేసు.

ఈ సమస్య నుండి ఎలా బయట పడాలని ఆలోచించగా ఆలోచించగా ఓ మహత్తరమైన ఐడియా తన బుర్రలోకి ప్రవేశించగానే తనని తనే అభినందించుకున్నాడు ఓబులేసు.

* * *

"బాగున్నావా బాబు" కాబోయే అల్లుడు ఓబులేసు తమ ఇంటికి వచ్చినందుకు ఆనందంగా పలకరించింది పార్వతమ్మ.

"వేరే పనిమీద పక్కూరుకొచ్చాను- ఎలాగూ ఇంత వరకు వచ్చి మిమ్మల్ని చూడకుండా వెళ్లడం మంచిది కాదని వచ్చాను" అతికిట్లు వుండే అబద్ధాన్ని చెప్పాడు ఓబులేసు.

కిచెన్‌లోకి వెళ్ళి మంచినీళ్ళు తీసుకుని వచ్చి ఓబులేసుకు ఇచ్చింది పార్వతమ్మ.

"మావయ్యగారు లేరా అత్తయ్యా?" తాగాక గ్లాసు పక్కనపెడుతూ అడిగాడు.

"పెళ్లి బట్టలు కొంటానికి సుజాత, మీ మావయ్య వెళ్లారు" అంది ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ పార్వతమ్మ. ఓబులేసు ఏవో కబుర్లు చెప్పుకుంటూ వున్నారు. ఇంతలో ఓబులేసు కుర్చీలోనుండి కిందపడి గిలగిల కొట్టుకోసాగేడు.

అది మూర్ఛవ్యాధి అని తెల్సుకున్న పార్వతమ్మ తాళం చెవులు తెచ్చి ఓబులేసు చేతిలో పెట్టింది. ఓ ఐదు నిముషాల తర్వాత ఓబులేసు స్పృహలోకి వచ్చాడు.



"ఏంటి బాబు. నీకు మూర్ఛవ్యాధి వుందా?" ఆందోళనగా అడిగింది పార్వతమ్మ.

"ఔను అత్తమ్మ- మా ఇంట్లో వాళ్ళు మీకు చెప్పలేదా?" అన్నాడు ఓబులేసు.

'లేదు' అన్నట్లు తలాడించింది పార్వతమ్మ.

"నాకీ జబ్బు చిన్నప్పట్నుంచి వుంది- ఎంతోమంది డాక్టర్లకు చూపించాను అయినా ఫలితం లేదు" అని క్యాజువల్‌గా చెప్పాడు ఓబులేసు, జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

ఓబులేసుకు ఏ చెడు అలవాట్లు లేవనుకొని సంబరపడ్డ పార్వతమ్మకు చుక్కెదురైంది.

ఇదివరకు ఆనందంగా మాట్లాడిన పార్వతమ్మ మొహంలో ఆందోళన చోటు చేసుకోవడంతో తన పాచిక పారిందని ఓబులేసు లోలోనే సంతోషించాడు.

ఓబులేసు ఎప్పుడెళ్లిపోయాడో కూడా గమనించనంత ఆలోచన్లో వుంది పార్వతమ్మ.

* * *

ఓబులేసు ఊహించినట్టుగానే వెంకట్రావు గారి వాళ్ల సంబంధం కాన్సిల్ అయింది.

ఆ మరుసటి రోజే పెళ్లిళ్ల పేరయ్యను పిలిపించి మంచి సంబంధాలు చూడమని పురమాయించాడు ఓబులేసు.

అనుకున్నామని జరగవు అన్నీ అన్నట్లు ఓబులేసుకు అమ్మాయిని ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. పెద్ద డాక్టర్లక్కూడా లొంగని మూర్ఛవ్యాధి ఓబులేసుకు వుందని ఊరూవాడా ప్రచారం అయిపోయింది. తన గొయ్యి తనే తవ్వుకున్న చందాన తయ్యారైంది ఓబులేసు బతుకు. కట్నం అక్కర్లేదు, అమ్మాయి అందంగా లేకపోయినా ఫర్వాలేదు అన్నా ఏ సంబంధం కుదరలేదు. ఇలా వుండగానే ఓబులేసు పాతికేళ్ళ వయసు ముప్పైకి చేరుకుంది. గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లు ఓబులేసు వయసు థర్టీ ప్లస్ అయినా చూట్టానికి ఫార్టీ ప్లస్‌లా కనిపిస్తాడు.

కర్ణుడి చావుకు వంద కారణాలు అన్నట్లు ఓబులేసు వయసు నలభైకి దగ్గరపడ్డంతో వయసు మళ్ళిన వాడికింద జమకట్టి పెళ్లిళ్ల పేరయ్యలు కూడా సంబంధాలు చూడ్డం మానేశారు.

ఒకరోజు ఎవరో దంపతులు తమ ఇద్దరు పిల్లలతో షికారుకి వెళుతూ జోకులు వేసుకుంటూ చూడముచ్చటగా వున్నారు. తెలిసిన వాళ్లలా అనిపించేసరికి ఓబులేసు వాళ్లని పట్టి పట్టి చూశాడు. ఆమె వెంకట్రావుగారి అమ్మాయి సుజాత.

బుద్ధి తక్కువ పని చేసి ఆమెతో పెళ్లి కాకుండా చెడగొట్టుకున్నందుకు సిగ్గుతో వాళ్లకి మొహం చూపించలేక మలుపు తిరిగి మరో దారిన వెళ్లిపోయాడు ఓబులేసు.

-ఎం.గాంధీ (హైదరాబాద్)